బీసీ వెల్ఫేర్ ఈడీగా కుష్బూ కొఠారి

ప్రజాశక్తి -అనంతపురం

అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

అనంతపురం జిల్లా బీసీ వెల్ఫేర్ ఈడిగా కుష్బూ కొఠారి శనివారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఈడీగా పనిచేస్తున్న నాగమణి పదవీ విరమణ చేయటంతో నూతనంగా బీసీ వెల్ఫేర్ ఎంపవర్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆమెను రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించింది. ఈ నేపథ్యంలో కారాలయంలో బాధ్యతలను స్వీకరించిన ఆమెకు కార్యాలయ సిబ్బంది సూపరింటెండెంట్ ఆర్.విజయలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ గోవిందరాజులు, టైపిస్టు వెంకటేష్, రికార్డు అసిస్టెంట్ రమేష్‌బాబు అభినందనలు తెలిపారు.

గ్యాస్ సిలిండర్ తీసుకెళ్తున్న వినియోగదారుడు

గ్యాస్ సిలిండర్ల సరఫరాలో జాప్యం

బుక్ చేసిన పది రోజులకూ అందని వైనం
ఇబ్బందుల్లో వినియోగదారులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

బొమ్మనహాల్ మండల పరిధిలోని పలు గ్రామాలకు వంట గ్యాస్ సిలిండర్లు సకాలంలో సరఫరా చేయడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో కూడా దాదాపు అన్ని కుటుంబాల వారూ వంట చేసేందుకు గ్యాస్ వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో ఆయా కుటుంబాలు గ్యాస్ కనెక్షన్లు పొందాయి. వినియోగదారులు గ్యాస్ బుక్ చేస్తే కంపెనీ సిబ్బంది ఒక్కో సిలిండర్‌కు రూ.1,290 వసూలు చేస్తున్నారు. దీనికి తోడు ఇంటి వద్దకు వచ్చి సిలిండర్ ఇవ్వాలని నిబంధన ఉన్నా సరఫరా చేయడం లేదని పేర్కొంటున్నారు. బళ్లారి-కణేకల్ ప్రధాన రహదారి వద్దకు వచ్చి సిలిండర్ తీసుకెళ్లాలని కంపెనీ సిబ్బంది పేర్కొంటున్నారని, ఈ విషయమై కంపెనీ నిర్వాహకులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ప్రధాన రహదారి నుంచి గ్రామంలోకి అర కిలోమీటర్ దూరం ఉందని, దీంతో వికలాంగులు, వృద్ధులు సిలిండర్ తీసుకెళ్లడానికి కూలీలను ఆశ్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు. దీనికి తోడు సిలిండర్ లీకేజీ అవుతున్నా, రెగ్యులేటర్ పని చేయకపోయినా ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక ప్రయివేటు మెకానిక్‌లను ఆశ్రయించి అదనంగా సొమ్ము చెల్లిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి, హాస్టళ్లకు, హోటళ్లకు కూడా సిలిండర్లు సక్రమంగా సరఫరా చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్యాస్ బుక్ చేసిన మూడు రోజులకే సిలిండర్ ఇంటి వద్దకే సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

జిఎస్‌టి మాటున జీరో వ్యాపారం..

'హిందూపురం పట్టణంలో నివాసం ఉంటున్న రమేష్ తన కూతురి వివాహం కోసం పట్టణంలోని మెయిన్ బజారులో ఉన్న ఓ బంగారు దుకాణంలో బంగారం కొనుగోలు చేశారు. అయితే దుకాణం యజమాని ఎటువంటి బిల్లులూ ఇవ్వకుండా తెల్లకాగితంపై రాసి ఇచ్చారు. బిల్లు అడిగినప్పటికీ ఇవ్వలేదు'.

'పట్టణంలో నివాసం ఉంటున్న అబ్దుల్లా కూలి పని చేసుకుంటు జీవనం చేస్తున్నాడు. తన కూతురికి వివాహం నిశ్చయం కావాడంతో పట్టణంలో ఉన్న బంగారు దుకాణంలో 20 గ్రాముల బంగారం కొనుగోలు చేశారు. ఇతనికి కూడా బిల్లులు ఇవ్వకుండా తెల్ల కాగితంపై రాసి ఇచ్చారు'.

ఉమ్మడి అనంత జిల్లాలో నెలకు రూ.30 కోట్ల వ్యాపారం
ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
అనుమతులు లేనిదే దాడులు చేయలేమంటున్న అధికారులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో ఏ షాపుకు వెళ్లి ఏ వస్తువు కొన్నా.. ఎవరూ బిల్లులు ఇవ్వరు. ఎవరైన ఆదాయ పన్నుల శాఖ కార్యాలయానికి సమర్పించాలని ఉద్యోగులు అడిగితే తప్ప బిల్లులు ఇవ్వరు. వారికి ఇవ్వాలన్నా అన్ని పన్నులు చేర్చి బిల్లులు ఇస్తున్నారు. బంగారు వ్యాపారులు సిండికేట్‌గా మారి పక్కన ఉన్న కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఎటువంటి పన్నులు చెల్లించకుండా కొనుగోలు చేసి, ఇక్కడ విక్రయించడంతోనే ఎవరూ బిల్లులు ఇవ్వడం లేదన్నది అక్షరసత్యం. నేడు అక్షర తృతీయ కావడంతో ఒక గ్రాము బంగారం అయినా కొనుగోలు చేయాలన్న సెంటిమెంట్‌ను వ్యాపారులు ఆదాయంగా మార్చుకుంటు అక్రమ సంపాదనకు ద్వారాలను తెరిచారు.

జిల్లాలో బంగారం వ్యాపారులు ప్రభుత్వానికి భారీ మొత్తంలో బురిడీ వేస్తున్నారనడానికి ఈ సంఘటనలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. భారీ లాభాల కోసం కొందరు జీరో బిజినెస్‌కు దిగుతున్నారు. ప్రభుత్వానికి కట్టాల్సిన పన్నులు ఎగ్గొట్టేందుకు బిల్లుల్లేని బంగారాన్ని భారీగా దిగుమతి చేసుకుంటున్నారు. అలాగే ఇతర ప్రాంతాలకు కూడా ఇక్కడి నుంచే సరఫరా చేస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయి. ఈ వ్యాపారంలో కొందరు భారీగా వెనకేసుకుంటున్నట్లు సమాచారం. దీనిపై వాణిజ్యశాఖ అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఖజానాకు జమ కావాల్సిన పన్నులు చెల్లించకుండా జేబులు నింపుకుంటున్నారు. చెన్నై, కోయంబత్తూరు, బెంగళూరు, ముంబై తదితర ప్రాంతాల నుంచి బంగారం బిల్లులు లేకుండా కొనుగోలు చేసి తెచ్చి అమ్ముకుంటున్నారు. అనేకమంది వ్యాపారులు వార్షిక లావాదేవీలు రూ.కోటి లోపు చూపించి ప్రభుత్వానికి జీఎస్టీ చెల్లించకుండా జాగ్రత్త పడుతున్నారు. ఇలాంటి వ్యాపారం లాక్‌డౌన్ సమయం నుంచి మరింత ఊపందుకుంది. కొంతమంది దొంగ బంగారం కొనుగోలు చేసి కరిగించి ఆభరణాలు చేసి వ్యాపారం చేస్తున్నారు. ఇటీవల వరుసగా కర్నాటక పోలీస్ అధికారులు పట్టుకుంటున్న బంగారం కేసులే ఇందుకు నిదర్శనం.

బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు..

బంగారం వ్యాపారం బిస్కెట్ల రూపంలో హోల్‌సేల్‌గా జరుగుతుంది. అందుకు సంబంధించిన నగదు లావాదేవీలన్నీ బ్యాంకుల ద్వారా జరుగుతాయి. అయితే వ్యాపారులు బిల్లులు లేకుండా తక్కువ ధరకు బంగారాన్ని నేరుగా నగదు చెల్లించి కొనుగోలు చేస్తారు. ఈ బంగారమంతా బ్లాక్‌లో వ్యాపారం జరుగుతుంది. దీంతో ప్రభుత్వానికి పన్నులు చెల్లించకపోవడంతోపాటు, నల్ల డబ్బు చలామణి అవుతుంది. ఇదే తరహాలో కొనుగోలుదారులకు కూడా బిల్లులు ఇవ్వకుండా వ్యాపారం చేస్తున్నారు. ఈ విధానం వల్ల ప్రభుత్వ ఖజానాకు గండిపడుతోంది. మరోవైపు కొనుగోలు దారులూ నష్టపోయే పరిస్థితి ఉంది.

లైసెన్స్ లేకుండానే వ్యాపారం..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో దాదాపు 70 నుంచి 80 మంది వరకూ లైసెన్స్ వ్యాపారులు ఉన్నారు. మరో 100 మంది వరకు ఎలాంటి లైసైన్సులు లేకుండా వ్యాపారం చేస్తున్నారు. హిందూపురం పట్టణంలో 20 నుంచి 30 మంది వరకూ లైసెన్స్ వ్యాపారులు ఉన్నారు. మరో 50 మంది ఎలాంటి లైసైన్సులు లేకుండా వ్యాపారం చేస్తున్నారు. లైసెన్సు ఉన్న వారు సైతం ఎక్కువ వ్యాపారం బిల్లులు లేకుండానే సాగిస్తున్నారు. లైసెన్సులు లేని వారు అసలు ఎలాంటి బిల్లులు ఇవ్వడం లేదు. ఆ ప్రకారం నెలకు సుమారుగా రూ.30 కోట్ల బంగారం వ్యాపారం జరిగితే సగం అంటే రూ.15 కోట్లకు బిల్లులు ఉండవు. తద్వారా నెలకు రూ.కోటికి పైగా ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. ఆ ప్రకారం ఏడాదికి రూ.12 కోట్ల మేర ఖజానాకు రాకుండా పోతోంది.

హిందూపురం పట్టణంలోని బంగారు దుకాణాలు

బిల్లులు లేకుండా వ్యాపారం..

బంగారం టోకుగా ఇలా జరుగుతుండగా చిల్లర వ్యాపారులు అంటే..బంగారం తయారీ పేరుతో దుకాణాలు నిర్వహిస్తున్న వారు బిల్లులు లేని బంగారం కొనుగోలు చేసి ఆభరణాలు తయారుచేసి విక్రయిన్నారు. కొంత బంగారాన్ని కరిగించి బిస్కెట్లుగా చేసి విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి బిస్కెట్లు బ్లాక్‌మనీ ఉన్నవారు కొనుగోలు చేసి అధిక ధరలు వచ్చినప్పుడు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. దీన్ని అడ్డుకోవాల్సిన వాణిజ్య పన్నుల శాఖ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. భారీగా జీరో వ్యాపారం జరుగుతుంటే గుడ్లప్పగించి చూస్తుండటం అనుమానాలకు తావిస్తోంది. బిల్లులు ఇవ్వకుండా జరిగే వ్యాపారాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వాణిజ్య శాఖ ఇన్‌ఛార్జి అసిస్టెంట్ కమిషనర్‌ను అడిగితే.. కమిషనర్ అదేశాలు లేనిదే తాము దాడులు నిర్వహించడానికి అధికారాలు లేవని అంటున్నారు. అధికారులకు అన్ని అధికారాలు ఉన్నా, వ్యాపారులు ఇచ్చే మాముళ్లతో ఉన్న చట్టాలను వ్యాపారులకు చుట్టాలుగా మార్చారు. దీంతో జీరో వ్యాపారం మూడు పువ్వులు..ఆరు కాయలుగా జరుగుతోంది.

ఎసిబి దాడులు జరిగినా మార్పులు లేవు..

రెండు నెలల క్రితం హిందూపురం పట్టణంలో వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంపై అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.30 వేలు లంచం తీసుకొంటూ అవినీతి అధికారులు అడ్డంగా దొరికారు. దీంతో అసిస్టెంట్ కమిషనర్‌తో పాటు మరో మగ్గురిపై కేసులు నమోదు చేశారు. అయినప్పటికి ఈ శాఖలో మార్పు రాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బంగారు దుకాణాలపై దాడులు నిర్వహించాలి. బిల్లులు ఇవ్వకుండా వ్యాపారాలు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలి. శాఖాపరమైన చర్యలు తీసుకుంటే, ప్రభుత్వానికి కోట్లాది రూపాయాల ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నాయి.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగించాలి
సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య సేవలు అందించిన ఆసుపత్రులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో రూ.2 వేల కోట్ల బకాయి బిల్లులు ఉన్నాయని, తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయకుండా ప్రయివేట్ ఆస్పత్రులను ప్రోత్సహించే పద్ధతుల్లో ఆరోగ్యశ్రీ అమలవుతోందని.. ఈ విధానంలో మార్పు రావాలన్నారు. జిల్లాలో సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో 550 పడకలకు మాత్రమే సరిపడా సిబ్బంది, వైద్య పరికరాలు అందుబాటులో ఉండగా, వెయ్యి నుంచి 1200 మంది రోగులు అడ్మిషన్‌లో ఉంటున్నారని తెలిపారు. ఓపీ విభాగంలో 1800 నుండి 2000 మంది రోగులు వస్తున్నారని తెలిపారు. వీటి నిర్వహణకు అవసరమైన సిబ్బంది, మందులు, పరికరాలు, నిధులు ఏర్పాటు చేయకుండా సంవత్సరాలుగా నిర్లక్ష్యం చేయబడుతోందన్నారు. మరో వైపు కొన్ని ప్రయివేట్ ఆసుపత్రులకు కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని ఆరోగ్య శ్రీ కింద ఖర్చు పెడుతున్నారని తెలిపారు. ప్రజలను క్రమంగా ప్రయివేట్ ఆసుపత్రులకు మళ్లించి ప్రస్తుతం బిల్లులు చెల్లింపు చేయడంలేదన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే మే 1 నుంచి ఆరోగ్య శ్రీ సేవలు నిలిపి వేయాలని ప్రయివేట్ ఆసుపత్రులు ప్రకటించడం ఆందోళనకరంగా ఉందన్నారు. ప్రయివేట్ ఆసుపతుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తే ప్రజల పరిస్థితి దారుణంగా ఉంటుందని తెలిపారు. తక్షణం పెండింగ్ బిల్లులు విడుదల చేసి వైద్య సేవలు కొనసాగించాలని కోరారు.

విద్యుత్ శాఖ ఎస్ఇకి వినతిపత్రం అందజేస్తున్న అనంత వాటర్ ప్లాంట్స్ అసోసియేషన్ సభ్యులు

అయినకాడికి దండుకో..

విద్యుత్ శాఖ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

ప్రజాశక్తి - అనంతపురం

సాధారణ ప్రజలు ఒక నెల విద్యుత్ బిల్లు చెల్లించటం ఆలస్యం అయితేనే అధికారులు సరఫరా నిలిపి వేస్తారు. అయితే తమకు కావాల్సింది అందితే చాలు ఇక నిబంధనలు తరువాయి అన్న చందంగా కొందరు అధికారుల తీరు వుండడంతో యావత్తు విద్యుత్ శాఖ తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి ఘటన ఇటీవల స్వయానా విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా చర్యలు మాత్రం శూన్యం. వివరాల్లోకి వెళ్తే.. వేసవి కావటంతో శుద్ధజలం వ్యాపారానికి డిమాండ్ పెరిగింది. అయితే ఇదే అదనుగా నీటి వ్యాపారం చేసే వారి సంఖ్య రోజు రోజుకూ పెరిగింది. సాధారణ సమయంలో కన్నా నాలుగింతలు వ్యాపారం పెరిగింది. అనంతపురం, పరిసర ప్రాంతాల్లో సుమారుగా 300 నీటి శుద్ధి కేంద్రాలు ఉన్నాయి. వీటి అనుమతుల నిబంధనలు అటుంచింతే కనీస పరిమితులు లేకుండా వ్యాపారం చేస్తున్న వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. మరో వైపు విద్యుత్ అధికారుల అండతో బల్లకింద చేతులు తడిపి వ్యాపారం చేసే వారు అధికమవుతున్నారు. సాధారణంగా నీటి శుద్ధి కేంద్రాలను విద్యుత్ శాఖ కమర్షియల్ రంగంగా పరిగణలోకి తీసుకుని క్యాటగిరి 2 గా గుర్తించింది. ఆజాద్ నగర్‌లోని ఓ ప్లాంట్ యాజమాని అధికారులకు బాగానే పైసలు ముట్టచెప్పినట్లు వినికిడి. అయితే కొందరు వ్యాపారులు రాజకీయ, అంగ బలంతో నిబంధనలు మరుగున పెట్టి క్యాటగిరి 3గా బిల్లులు చెల్లిస్తున్నారు. ఈ విషయాన్ని స్వయానా అనంత వాటర్ ప్లాంట్ అసోసియేషన్ సభ్యులు విద్యుత్ శాఖ ఎస్ఇ దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఈ విషయంలో అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పదుల సంఖ్యలో ప్లాంట్ల యాజమానులు విద్యుత్ శాఖ కళ్లుగప్పి వ్యవహరిస్తుండడంలో ఆంతర్యం అర్థంకావడం లేదు. ఇటప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి నిబంధనలను అందరికీ ఒకే విధంగా అమలు చేస్తారా లేదా చూడాల్సివుంది.

కెజిబివిలను నిత్యం పర్యవేక్షించాలి

డిఇఒ ఎం. సాయిరామ్

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

కస్తూరిబా పాఠశాలలను నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలని డిఇఒ, ఇన్‌ఛార్జి ఎపిసి ఎం.సాయిరాం సూచించారు. జిల్లాలోని కెజిబివి ఎస్ఒలతో శనివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ వచ్చేవారంలో రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ జిల్లాకు రానున్న నేపథ్యంలో ఎస్ఒలు నిత్యం కెజిబివిలను పర్యవేక్షించాలని ఆదేశించారు. పర్యవేక్షణకు వెళ్లినప్పుడు విద్యార్థులు ఏవిధంగా చదువుతున్నారు.. టీచర్లు ఏ విధంగా పాఠాలు చెబుతున్నారు.. మెనూ అమలు చేస్తున్నారా.. వంట గది శుభ్రంగా ఉందా.. లేదా.. మరుగుదొడ్లు శుభ్రంగా ఉన్నాయా.. లేవా.. అని పరిశీలించాలన్నారు. అలాగే విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు ఇచ్చారా.. బైజ్యూస్ ట్యాబులను వినియోగిస్తున్నారా? లేదా? అని కూడా చూడాలన్నారు. కేజీబీవీల్లో ఏమైనా జరిగిగే ఎస్ఒలదే బాధ్యత అన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే కాంట్రాక్టు రద్దు చేయడంతోపాటు క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

'స్పాట్'లోకి ఎవరూ రాకూడదు : డిఇఒ

అనంతపురంలోని కెఎస్ఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు టెన్త్ స్పాట్ వాల్యూషన్ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో వాల్యూయేషన్ విధులకు ఆర్డర్స్ తీసుకున్న టీచర్లు, హెచ్ఎంలు, ఎంఈవోలు మినహా ఇతరులు అనవసరంగా రాకూడదని డిఇఒ తెలిపారు. అత్యవసరంగా డిఇఒను కలవాలంటే సాయంత్రం 4:30 గంటల తర్వాత ముందస్తు అనుమతితో లోపలికి రావాలన్నారు.

టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిఇఒ సాయిరాం

మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం

ప్రచారభేరిలో వామపక్ష నాయకులు

ప్రజాశక్తి-పుట్లూరు

కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపి దేశాన్ని కాపాడుకుందామని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని చింతకుంట, కందికాపుల గ్రామాల్లో గ్రామ శాఖల కార్యదర్శులు డి.పెద్దన్న, కుళ్లాయప్ప అధ్యక్షతన ప్రచార భేరి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజావ్యతిరేక, నిరంకుశ విధానాలను అవలంబిస్తోందన్నారు. అంతేగాకుండా దేశ ఉమ్మడి సంపదగా ఉన్న బ్యాంకుల్ని సైతం ప్రయివేటీకరణ చేసేందుకు పూనుకుందన్నారు. ఓడరేవుల్ని, అందరికీ అన్నం పెట్టే వ్యవసాయాన్ని సైతం కార్పొరేట్లకు ధారాదత్తం చేసేందుకు పూనుకుందన్నారు. మోడీ అండదండలతోనే అంబానీ, అదానీలు వేల కోట్లకు పడగలెత్తుతున్నారన్నారు. మరోవైపు గ్యాస్, పెట్రో, నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. అరికట్టాల్సిన కేంద్రం చూస్తూ ఊరుకుందన్నారు. ఆయా విధానాలను నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో ఈనెల 30న నిర్వహించనున్న ఆందోళనలు ప్రజలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు సి.పెద్దిరాజు, చేతివృత్తిదారుల సమైక్య మండల అధ్యక్షులు సి.ఓబుళపతి, సూరి, బాలన్న, రంగనాథ్, ఆంజనేయులు, డి.రామాంజనేయులు, పులి, ఆదెన్న, అనూష, చిట్టెమ్మ, పెద్దక్క, నాగ మునిమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రచారభేరిలో పాల్గొన్న వామపక్ష నాయకులు

మజ్జిగ పంపిణీలో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, సిపిఎం నాయకులు

లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

మసీదు వద్ద సిపిఎం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

భిన్నత్వంలో ఏకత్వంగా సర్వమతాల వారు అన్నదమ్ములుగా మెలుగుతున్న దేశ ప్రజాస్వామ్యాన్ని, లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకుందామని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పిలుపునిచ్చారు. రంజాన్ పండుగ సందర్భంగా హెచ్ఎల్‌సి కెనాల్ దగ్గర ఉన్న మసీదు, ఇందిరా నగర్‌లోని మసీద్‌ల్లో ప్రార్థనలకు హాజరైన ముస్లిములకు సిపిఎం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ముందుగా రాంభూపాల్‌తోపాటు నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి ముస్లిములను ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లిం సోదరులు చేసే ప్రార్థనలు సఫలం కావాలని, దేశానికి శుభం కలగాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం దేశంలో పరిస్థితులను చూస్తుంటే మనల్ని పరిపాలిస్తున్న పాలకుల విధానం చాలా భయంకరంగా ఉందన్నారు. ఒక వర్గాన్ని భయపెట్టే విధంగా పరిపాలన సాగుతుందన్నారు. కావున ఈ విధానానికి వ్యతిరేకంగా హిందూ- ముస్లింలు ఐక్యంగా కలిసి పోరాడాల్సి ఉందన్నారు. ముస్లిం పెద్దలు విచ్చేసి సిపిఎం చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఇందిరా నగర్ శాఖ కార్యదర్శి ప్రసాద్, అంజి, రాము, చిరంజీవి, సాగర్, మోహన్, వెంకటేశు, సిపిఎం నగర నాయకులు ప్రకాష్, వెంకటేష్, వలీ, మసూద్, బాబు, జీవ, గపూర్, వెంకటనారాయణ, నరసింహారెడ్డి, ఫక్రు, రామాంజి, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలల రెన్యువల్ గడువు పెంపు హర్షణీయం

ప్రజాశక్తి-అనంతపురం

మిఠాయిలు పంచుకుంటున్న ఆపుస్మా నాయకులు

రాష్ట్రంలో ప్రయివేట్ పాఠశాలలు రెన్యూవల్ గడువు మూడు సంవత్సరాలు నుంచి ఎనిమిది సంవత్సరాలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ విడుదల చేయడంతో పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, ఆంధ్రప్రదేశ్ ప్రయివేటు పాఠాశాల యాజమాన్య సంఘం (ఆపుస్మా) రాష్ట్ర అధ్యక్షులు ఎంవి.రామచంద్రారెడ్డి హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా శనివారం నగరంలోని అపుస్మా జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక సందర్భంలో తాను గెలిస్తే ప్రయివేటు పాఠాశాలల రెన్యూవల్ గడువును మూడేళ్ల నుంచి పదేళ్లకు పెంచాలని హామీ ఇచ్చానన్నారు. ఈ హామీ మేరకు గెలిచిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో స్పందించిన సిఎం జగన్ జీవో 38ని విడుదల చేస్తూ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఇందుకు సిఎం జగన్, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, తన తోటి ఎమ్మెల్సీ కల్ప లతారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆపుస్మా జిల్లా అధ్యక్షుడు కుసుమ పుల్లారెడ్డి, రాష్ట్ర కోఆర్డినేటర్ రామిరెడ్డి, సంజీవరెడ్డి, శశిభూషన్, కన్వీనర్ నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, సభ్యులు రఘునాథరావు, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల, గుత్తిలో ప్రార్థనలు ప్రత్యేక చేస్తున్న ముస్లిములు

అనంతపురంలో ముస్లిములకు శుభాకాంక్షలు తెలుపుతున్న జనసేన నాయకుడు టిసి వరుణ్

ఘనంగా రంజాన్ వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం

మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగని జనసేన జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్ అన్నారు. శనివారం అనంతపురం ఈద్గా మైదానంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొని ముస్లిములకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు ఆ అల్లా దయతో సుఖశాంతులతో జీవించాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు బాబురావు, జిల్లా ఉపాధ్యక్షులు అంకె ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు కుమ్మర నాగేంద్ర, జిల్లా కార్యదర్శులు కిరణ్‌కుమార్, విజయకుమార్, ముప్పూరి కృష్ణ, నగర ఉపాధ్యక్షుడు జక్కిరెడ్డి ఆదినారాయణ, నగర ప్రధాన కార్యదర్శులు మేదర వెంకటేష్, హుస్సేన్, ధరాజ్ బాషా, నగర కార్యదర్శులు లాల్‌స్వామి, మురళి, సంపత్, వెంకటరమణ, జనసేన నాయకులు చిరు, వడ్డే వెంకటేష్, అబు, హిద్దు, నౌషాద్ మరియు తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : రంజాన్ పండుగను గుత్తిలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ముస్లిములు ఈద్గా మైదానాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మత గురువులు రంజాన్ విశిష్టతను వివరించారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలో శనివారం ఈద్-ఉల్-ఫితర్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శనివారం ఉదయాన్నే స్థానిక జామియా మసీదు నుంచి ఊరేగింపుగా ఈద్గాకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

బొమ్మనహాల్ : మండలంలోని ముస్లిం సోదరులు శనివారం ఈద్-ఉల్-ఫితర్‌ను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఈద్గాకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మత గురువులు రంజాన్ విశిష్టతను వివరించారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

ఉరవకొండ : అల్లాహ్ బోధించిన ప్రేమ, కరుణ, సాటివారికి సాయం వంటి మార్గాలు అనుసరణీయమని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శనివారం రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఉరవకొండ ఈద్గా వద్ద వేలాది మంది ముస్లిములు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈప్రార్థనల్లో వై.విశ్వేశ్వరరెడ్డి పాల్గొని మతపెద్దలు, ముస్లిములను ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ మీరం బాషా, పిఎసిఎస్ ఛైర్మన్ వడ్ల షేక్షావలి, కో అప్షన్ పామిడి సలీమ్, మైనారిటీ నాయకులు ఆసీఫ్, పామిడి జాకీర్, అన్వర్, ఎంఎ జీలన్, దర్గా కమిటీ ఛైర్మన్ బాషా, ఎంపిటిసి హోన్నూర్‌సాబ్, అయ్యూర్ దాదా, వడ్ల సలీం, టైలర్ శర్మస్, రఫీ, తాజూ, జాఫర్, జిలాన్, రఫీ, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : మండల కేంద్రంలో శనివారం రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రంగరాయల చెరువు కట్ట వద్ద ఉన్న ఈద్గాలో ముస్లిములు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

యాడికి : మండలవ్యాప్తంగా ముస్లిములు రంజాన్ పండుగను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముఖ్యంగా పట్టణంలోని జామియా మసీదు నుంచి అల్లాహు అక్బర్ అంటూ ర్యాలీగా కోనరోడ్డులోని ఈద్గా మైదానానికి చేరుకున్నారు. అనంతరం మత గురువులు మహమ్మద్ ఉమర్ అలీ రంజాన్ విశిష్టతను వివరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

నార్పల : మండలవ్యాప్తంగా శనివారం ఈద్-ఉల్-ఫితర్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయాన్నే జామియా మసీదు నుంచి ఊరేగింపుగా ఈద్గాకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలిపారు.

పుట్లూరు : మండలంలోని గూడూరు, చెర్లోపల్లి, కడవకల్లు తదితర గ్రామాల్లో శనివారం ఈద్-ఉల్-ఫితర్ వేడుకను ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఉదయాన్నే మసీదుకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

బొమ్మనహాల్, ఆత్మకూరులో ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

ఉరవకొండ ప్రార్థనల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

యాడికి : ప్రమాదవశాత్తు పొలంలోని కరెంట్ తీగలు తగిలి అశోక్ కుమార్(22) షాక్‌గురై మృతిచెందిన ఘటన శుక్రవారం మండలంలోని పుప్పాల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యాడికి మండలం పుప్పాల గ్రామానికి చెందిన తిమ్మారెడ్డి, నాగలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. రెండవ కుమారుడు అశోక్ పదవ తరగతి చదివి ఇంటి వద్దనే ఉంటూ వ్యవసాయం పనులు చూసుకునేవాడు. ఇందులో భాగంగా గురువారం రాత్రి తమ పొలంలో సాగు చేసిన బెండ, పత్తి పంటలకు నీరు కట్టేందుకు వెళ్లాడు. అక్కడ మోటార్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తే కరెంట్ తీగలపై పడటంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. శుక్రవారం ఉదయం టిఫిన్ తీసుకెళ్లిన తల్లిదండ్రులు గమణించి బోరున విలపించారు. అశోక్‌కుమార్ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించినట్లు తెలిపారు.

మృతిచెందిన అశోక్ కుమార్

రెండిళ్లల్లో చోరీ

చెల్లాచెదురుగా పడి ఉన్న బీరువాలోని వస్తువులు

గుత్తి : మండలంలోని టి.కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి రెండు ఇళ్లలో చోరీ జరిగింది. అన్నదమ్ములు చంద్ర, నాగరాజు కుటుంబ సభ్యులతో కలిసి ఇంటిపైన నిద్రించారు. గమనించిన గుర్తు తెలియని దుండగులు చంద్ర ఇంటి తాళాలు తొలగించి లోనికి ప్రవేశించి బీరువాను బద్దలుగొట్టి జత బంగారు కమ్మలు, రూ.40వేల నగదును దోచుకున్నారు. అలాగే నాగరాజు ఇంట్లోకి ప్రవేశించి రూ.20 వేలు నగదు జత బంగారు కమ్మలను చోరీ చేశారు. అలాగే ఓబులేసు ఇంటి ఎదురుగా ఉంచిన ద్విచక్ర వాహనాన్ని దుండగులు అపహరించుకెళ్లారు. ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు

కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ దంపతులు

అనంతపురం కలెక్టరేట్ : నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎం.గౌతమిని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఎల్ఎం.మోహన్‌రెడ్డి శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంధర్భంగా గ్రంథాలయాలకు రావాల్సిన సెస్ బకాయిలు అందేలా చూడాలని ఉమాదేవి కోరారు. అదేవిధంగా నగర మునిసిపల్ కార్పొరేషన్, జిల్లాలోని మున్సిపాలిటీ నుంచి నగర పంచాయితీలు, గ్రామ పంచాయతీ ల నుంచి గ్రంథాలయ సంస్థకు రావాల్సిన బకాయిలు వెంటనే సంస్థ నిధులకు చెల్లించే విదంగా చర్యలు తీసుకుని సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ తప్పకుండా లైబ్రరీ సెస్ చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

యాడికి ఎస్ఐగా గురుప్రసాద్‌రెడ్డి

యాడికి : యాడికి ఎస్ఐగా గురుప్రసాద్‌రెడ్డి శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. స్పెషల్ బ్రాంచ్ లో పనిచేస్తున్న ఆయన యాడికికి నియమితులయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలను పూర్తిస్థాయిలో అరికడతానన్నారు. ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారు ఎవరైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

మసీద్ నిర్మాణానికి విరాళం

ఉరవకొండ : విడపనకల్లు మండల పరిధిలోని గడేకల్ గ్రామంలో మసీదు నిర్మాణానికి ఎంపిపి కరణం పుష్పవతి భీమ్‌రెడ్డి దంపతులు శనివారం రూ.లక్ష విరాళం అందజేశారు. ముందుగా రంజన్ పండుగను పురస్కరించుకుని ముస్లిం మత పెద్దలు ఏర్పాటు చేసిన మత ప్రార్థనల్లో ఎంపిపి దంపతులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గతంలో ఉన్న మసీదు నాలుగు లైన్ల రహదారి నిర్మాణంలో భాగంగా తొలగించారు. దీంతో గడేకల్ గ్రామ సచివాలయం-2 పక్కనే స్థలం ఇప్పించడంతోపాటు మసీదు నిర్మాణం కోసం రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, ఎంపిటిసి ఓబులేష్, హంపయ్య, ప్రసాద్, ఎర్రన్న, చిన్న తిమ్మన్న, ఈరన్న, అశోక్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, శశిరెడ్డి, ఉమా శంకర్, భీమన్న, మల్లారెడ్డి, మాధవరెడ్డి, కురువ భీమలింగ, రామాంజనేయులు, లాలెప్ప, మనోహర్, ముస్లిం మత పెద్దలు హజరత్, గౌస్, సొసైటీ మాబు, పీరా, తదితరులు పాల్గొన్నారు.

జల సంరక్షణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-అనంతపురం

ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నగరూరు రసూల్ ఆధ్వర్యంలో బుక్కరాయసముద్రం మండలం వెంకటాపురం హైస్కూల్ విద్యార్థులు దయ్యాలకుంటపల్లి గ్రామంలో జలసంరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఏడు రోజుల ప్రత్యేక శిబిరంలో భాగంగా చివరి రోజు శనివారం యోగా నిర్వహించారు. అనంతరం గ్రామంలోని వాటర్ ట్యాంకుల చుట్టుపక్కల ఉన్న చెత్తాచెదారాలను తొలగించారు. అనంతరం జల సంరక్షణ-జన సంరక్షణ, నీటిని సంరక్షించుకుందాం-కరువును తరిమి కొడదాం, జలంతోనే జనం- లేకుంటే లేదు జీవనం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సాంబశివుడు, అశోక్, జ్ఞానేశ్వర్, శివ, ప్రత్యూష, అభి, సుష్మ, స్రవంతి, మైత్రి, నికిత, వందన, యమున, రమ్య, కార్తికేయ, భవ్యశ్రీ, ప్రజలు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ శిబిరోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం

ఎస్కెయు కళాశాల ఆఫ్ ఫార్మాసుటికల్ సైన్సెస్ ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ప్రత్యేక శిబిరం శనివారం ముగిసింది. ఇందులో భాగంగా అతిథులు శిబిర్ జ్యోతిని వెలిగించి 'నాట్ మీ బట్ వి' అనే నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మురళీధర్ మాట్లాడుతూ యూనిటీ ఇన్ ఇంటిగ్రిటీ అనగా ఎన్ఎస్ఎస్ యూనిట్ కింద ఉన్న ప్రోగ్రామ్ ఆఫీసర్ అందరూ ఐక్యమత్యంతో ఎన్ఎస్ఎస్ ముఖ్య ఆశయాన్ని గుర్తించి సమాజానికి సేవ చేసి ఉద్ధరించాలని అర్థం అన్నారు. కావున ఎన్ఎస్ఎస్ ముఖ్య ఉద్దేశాన్ని గురించి యూనిటీ ఇన్ ఇంటిగ్రిటీని గుర్తు చేసుకుంటూ ఐక్యమత్యంతో దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఎస్కెయు కళాశాల ఫార్మాసుటికల్ ప్రిన్సిపల్ సోమశేఖర్ మాట్లాడుతూ ఇలాంటి ప్రత్యేక శిబిరాలు ఎన్నో నిర్వహించడానికి ఎల్లప్పుడూ ముందుంటానన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఎవల్యూషన్ జి.వెంకటరమణ, ఎస్కెయు ఇంజినీరింగ్ కళాశాల ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర, ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.సత్యసౌమ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ వెంకటరమణ, రామిరెడ్డి, సత్యనారాయణ, ధనుంజయ్, హేమంత్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

కొవ్వొత్తులను వెలిగిస్తున్న దృశ్యం

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి-ఉరవకొండ

బ్రహోత్సవ పోస్టర్లను విడుదల చేస్తున్న అర్చకులు

మండల పరిధిలోని పెన్నహోబిలంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవ పోస్టర్లను ఆలయ ఇఒ విజయ్‌కుమార్, ప్రధాన అర్చకులు ద్వారకనాథాచార్యులు, బాలాజీ స్వామి ఆధ్వర్యంలో శనివారం ఆలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 2 నుంచి 13వ తేదీ వరకు లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. 8న కళ్యాణోత్సవం, 10న బ్రహ్మరథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామికృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సందీప్‌పై చర్యలు చేపట్టాలి : ఏపీ ఎన్జీవో

ప్రజాశక్తి-గుత్తి



డిఎంహెచ్ఒకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎన్‌జిఒ నాయకులు

మండలంలోని బేతాపల్లి పిహెచ్‌సి డాక్టర్ సందీప్‌పై చర్యలు చేపట్టాలని ఏపీ ఎన్జీవోల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు డిఎంహెచ్ఒ డాక్టర్ వీరబ్బాయికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎన్జీవోల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మాధవ, జిల్లా కార్యదర్శి డి.చంద్రమోహన్ మాట్లాడుతూ బేతాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సందీప్ అక్కడ సిబ్బందిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా మానసికంగా వేధిస్తున్నారని వాపోయారు. వెంటనే డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందుకు డిఎంహెచ్ఒ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవోల సంఘం జిల్లా నాయకులు బి.వెంకటేష్ బాబు, రవికుమార్ ఎస్.జమీలాబేగం, బషీర్‌అహ్మద్, మనోహర్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, గుత్తి తాలూకా అధ్యక్షులు కె.శ్రీనివాసులు రాయదుర్గం తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు కె. లక్ష్మీనారాయణ, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కొర్రపాడులో 'మా నమ్మకం నువ్వే జగన్'

మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎంపిపి

బుక్కరాయసముద్రం : మండల పరిధిలో కొర్రపాడు గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంపిపి సునీత హాజరై ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలపై ఆరాతీశారు. అనంతరం ప్రతి ఇంటికీ మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్‌ను అతికించారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ మండల కన్వీనర్ బైపిరెడ్డి, బుల్లే నారాయణస్వామి, సచివాలయ కన్వీనర్ అక్కులప్ప, వైసీపీ సీనియర్ నాయకులు, వాలంటీర్లు, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం

ఉరవకొండ : ఉరవకొండ ఆపద్బాంధవ ట్రస్టు సభ్యుడు రేణుమాకులపల్లి గ్రామానికి చెందిన సుధాకర్ శనివారం రక్తదానం చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా సోమందేపల్లి మండలం మంచేపల్లికు చెందిన పార్వతమ్మ (38) అనారోగ్య సమస్యతో అనంతపురంలోని ఒక ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. గర్భసంచి ఆపరేషన్ చేయాలని తక్షణమే అత్యంత అరుదైన ఎబి నెగిటివ్ రక్తం ఎక్కించాలని వైద్యులు సూచించారు. దీంతో బాధితురాలి బంధువులు ఎంత వెతికినా రక్తం దొరకలేదు. విషయం తెలుసుకున్న ఉరవకొండ ఆపద్బాంధవ ట్రస్టు సభ్యుడు సుధాకర్ హుటాహుటిన అనంతపురం రక్తనిధికి చేరుకుని రక్తదానం చేసి ఆదుకున్నారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు సుధాకర్‌తోపాటు ఆపద్బాంధవ ట్రస్టుకు కృతజ్ఞతలు తెలిపారు.

యువనేత ప్రణయ్‌రెడ్డికి సత్కారం

ఉరవకొండ : వైసిసి యువజన విభాగం జోనల్ ఛైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి తన పుట్టినరోజు వేడుకలను నాయకులు, అభిమానుల మధ్య శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, ప్రజాప్రతినిధులు, అభిమానుల సమక్షంలో భారీ కేక్ కోసి పంచిపెట్టారు. అలాగే బెలుగుప్ప మండలానికి చెందిన వైసిపి నేతలు ఆయన్ను గజమాలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

చంద్రబాబుపై దాడి అమానుషం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

టిడిపి అధినేత చంద్రబాబుపై భౌతిక దాడికి తెగబడ్డ మంత్రి సురేష్, అతని గూండాలపై కఠిన చర్యలు తీసుకోవాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి కాలువ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రిగా ఉండి నడిరోడ్డుపై చొక్కా విప్పి సవాల్ చేయడం ఏంటని ప్రశ్నించారు. చంద్రబాబు పర్యటన రూటు మ్యాప్‌ను ముందే తెలుసుకుని, ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఆదేశాలతోనే మంత్రి సురేష్ రాళ్ల దాడి చేయించారని ఆరోపించారు. టిడిపికి వస్తున్న జనాదరణను ఓర్వలేక వైసీపీ ఇలా భౌతిక దాడులకు దిగుతోందన్నారు. ఎన్ఎస్‌జి భద్రత ఉన్న చంద్రబాబు సమీపంలోకి వైసీపీ గూండాలను పోలీసులు అనుమతించడాన్ని కాలవ తీవ్రంగా తప్పుపట్టారు. రాళ్ల దాడి నుండి చంద్రబాబును కాపాడే క్రమంలో జాతీయ భద్రతా దళం అధికారి తలకు గాయం కావడం రాష్ట్రంలో దిగజారిన శాంతిభద్రతలకు సాక్ష్యమన్నారు. ఇలాంటి చర్యలు చూస్తుంటే ఎన్నికలకు ఏడాది ముందే జగన్ రెడ్డి తన ఓటమిని అంగీకరిస్తున్నాడని ఎద్దేవా చేశారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద టిడిపి నేతలు నిరసన

జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న చంద్రబాబు కాన్వాయ్‌పై ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంలో రాళ్ల దాడి చేయించిన మంత్రి ఆదిమూలపు సురేష్‌ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని టిడిపి నేతలు డిమాండ్ చేశారు. శనివారం టిడిపి అర్బన్ నియోజకవర్గం, తెలుగు యువత నేతల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి దేవర్ల మురళి, జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, నగర మహిళా అధ్యక్షురాలు విజయ్‌శ్రీరెడ్డి మాట్లాడుతూ 15 సంవత్సరాలపాటు ముఖ్యమంత్రిగా పని చేసిన వ్యక్తికే భద్రత లేదంటే రాష్ట్రంలో సామాన్య ప్రజానీకానికి ఎలాంటి భద్రత కల్పిస్తారో ప్రజలే తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి నారయణ స్వామి యాదవ్, సుధాకర్ యాదవ్, తెలుగు యువత అధికార ప్రతినిధి బంగినాగ, తెలుగు యువత నగర అద్యక్షుడు బోమ్మినేని శివ, కూచి హరి, బుల్లే శివబాల, రాధాదేవి, పరమేష్, షణ్ముఖ, డాక్టర్ లక్ష్మిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా టిడిపి శ్రేణుల నిరసనలు

ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంలో టిడిపి అధినేత చంద్రబాబు కాన్వాయ్‌పై రాళ్లదాడి చేసినందుకు నిరసనగా నగరంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట టిడిపి బీసీ సెల్ నగర అధ్యక్షులు సిమెంట్ పోలన్న ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిడిపి బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీనరసింహులు మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా ప్రజల సమస్యలను ఎక్కడికక్కడ ఎత్తిచూపుతూ రోడ్‌షోల్లో ప్రసంగిస్తూ ముందుకుపోతున్న చంద్రబాబుపై మంత్రి ఆదిమూలపు సురేష్ వ్యవహరించిన పద్ధతి ఆక్షేపనీయమన్నారు. అధికారంలో ఉండి ప్రతిపక్ష నేతపై రౌడీల్లా ప్రవర్తించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే అన్నారు. దాడిని ప్రేరేపించిన మంత్రి ఆదిమూలపు సురేష్, అనుచరులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచపు వడ్డే వెంకటేష్, టిడిపి బీసీ సెల్ జిల్లా నాయకులు కొయ్యగుర పెద్దన్న, చంద్రాయుడు, రమేష్‌బాబు, తెలుగు యువత నాయకులు రవి, నరేంద్రయాదవ్, రాజేంద్ర, జగదీష్, నాగేంద్ర, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : టిడిపి అధినేత చంద్రబాబుపై దాడి అమానుషమని, దాడికి పాల్పడిన మంత్రి ఆదిమూలపు సురేష్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి డిమాండ్ చేశారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువనేత లోకేష్, చంద్రబాబు పర్యటనలకు ప్రజల నుంచి వస్తున్న స్పందనను చూసి ఓర్వలేక తప్పుడు ఆరోపణలు చేస్తూ దాడులకు తెగబడుతున్నారని ఆరోపించారు. వెంటనే చంద్రబాబుపై దాడికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మారుతీచౌదరి, ఆర్‌జి.శివశంకర్, డికె.రామాంజినేయులు, గోళ్ల వెంకటేశులు, కొల్లాపురప్ప, శ్రీనివాసరెడ్డి, గోవిందరెడ్డి, గడ్డం రామాంజినేయులు, రామన్న, ఎర్రిస్వామి, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

అనంతపురంలో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

శింగనమల : చంద్రబాబుపై ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంలో వైసిపి అల్లరిమూకలు దాడి చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని అనంతపురం టిడిపి అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. చంద్రబాబు ప్రజల్లో తిరగకుండా చేసేందుకు వైసిపి ప్రభుత్వం జీవో-1 తీసుకొచ్చిందన్నారు. అంతేగాకుండా ప్రజా సమస్యలను ఎక్కడికక్కడ వివరిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్న చంద్రబాబుపై మంత్రి ఆదిమూలపు సురేష్, అనుచరులు దాడికి పాల్పడటం హేయమైన చర్య అన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పుట్లూరు : చంద్రబాబునాయుడుపై దాడి అమానుషమని టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి గరికపాటి సుదర్శననాయుడు శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. దాడికి తెగబడిన వైసిపి గూండాలను, దాడికి కుట్ర పన్నిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.